క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇచ్ఛాపురం రూరల్: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రామారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

కవిటి: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

సర్టిఫికెట్‌ను సరిచేయాలని వినతి

మందస: ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌లో ఫొటో లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని.. సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు ఆర్.దిలీప్‌కుమార్ కోరారు. మే 31వ తేదీన తన కుమారుడి కోసం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను అధికారులు మంజూరు చేశారని.. అయితే అందులో ఫొటో రాలేదన్నారు. నీట్ కౌన్సెలింగ్‌కు అత్యవసరం కావున సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల డిప్యూటీ తహసీల్దార్ కె.రామకృష్ణకు మంగళవారం వినతి పత్రం అందజేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల మధ్య వివక్ష తగదు


కంచరాన చిన్నబాబు

కాశీబుగ్గ: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల మధ్య వివక్షత చూపడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కంచరాన చిన్నబాబు అన్నారు. పలాసలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులను పక్క మండలాలకు బదిలీ చేయాలన్న నిబంధనలు సరైనది కాదన్నారు. వీఆర్వో సొంత మండలంలో ఉద్యోగం చేయవచ్చుగాని.. సెక్రటరీకి ఆ నిబంధనలు వర్తించవా అని ప్రశ్నించారు. ఒకే క్యాడర్‌లో ఉన్న ఉద్యోగుల మధ్య ఈ వివక్షత ప్రభుత్వం చూపడం సరైనది కాదన్నారు. పంచాయతీ సెక్రటరీ గెజిటెడ్ అధికారికానప్పుడు పక్క మండలాల్లో పనిచేయాలనే నిబంధన ఎలా వర్తింపచేస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులందరూ సొంత మండలంలో పనిచేసేలా నిబంధనలను ప్రభుత్వం కల్పించాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో సోలమన్

మందస: మండలంలోని మూలిపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో–2 బి.ఎస్.సోలమన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. వంట కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫైన్‌రైస్ బియ్యాన్ని మాత్రమే వాడాలన్నారు. వేరే బియ్యం వాడుతున్నట్లు ఫిర్యాదులు రాకూడదన్నారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ప్రశ్నలు వేసి జవాబులురాబట్టారు. హోమ్ వర్క్ ఇచ్చి ఉపాధ్యాయులకు చూపించమన్నారు. పీఎంపీడియా, సిద్ధిగాం పాఠశాలలను కూడా సందర్శించారు.

భవనాలు శిథిలం.. విధులు భయం!

- పాముల పుట్టలతో తహసీల్దార్ కార్యాలయం
- ముళ్లపొదల మధ్య కొత్త భవనం
- పట్టించుకోని పాలకులు
- భయాందోళన మధ్య సిబ్బంది విధులు

వజ్రపుకొత్తూరు:

ప్రజలకు సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరులోని తహసీల్దార్, వెలుగు, మండల పరిషత్ కార్యాలయాల పేర్లు వినేందుకు గొప్పగా ఉన్నప్పటికీ భవనాలు మాత్రం శిథిలమైయ్యాయి. రోజూ అక్కడ ఎంపీడీవో నుంచి అటెండర్ వరకు భయంతో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పాముల పుట్టలు పెరిగిపోయి ఆందోళన కలిగిస్తున్నాయి. గోడలు, ప్రధాన పిల్లర్లు సైతం పెచ్చులూడిపోగా కింద పడుతున్న శ్లాబ్ శిథిలాలు భయం గొలుపుతున్నాయి. భవనాలకు వాడిన ఇనుము తుప్పు పట్టిపోగా, నాణ్యత లేని కిటికీల తలుపులు చెదలు పట్టి ఊడిపోయాయి. ఇంత ప్రమాదకరంగా ఉన్న భవనాల్లోనే గతి లేక అధికారులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. మండలాభివృద్ధిపై ప్రజాప్రతినిధులతో నిర్వహించే సర్వసభ్య సమావేశం గది కూడా శిథిలావస్థకు చేరింది. మొత్తం భవనమే పనికిరాకుండా పోయింది. తహసీల్దార్, మండల పరిషత్‌కు నిధులున్నా కనీసం రంగులు వేయని దుస్థితి ఉంది. ఎనిమిదేళ్ల కిందట నిర్మించిన వెలుగు కార్యాలయం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ భవనం ఫ్లోర్ టైల్స్ శిథిలమవ్వగా కిటికీలు, తలుపులు చెదలు పట్టి పాడైయ్యాయి. భవనాలు శ్లాబ్, గోడలు బీటలు వారి వర్షం వస్తే చాలు కారిపోయి విధులు నిర్వహించలేని దుస్థితి ఉంది. ఎంపీడీవో కార్యాలయంలోనైతే ఏకంగా మెట్లు ఎక్కే మార్గానికి అడ్డుగోడ కట్టి నడవకుండా మూసేశారు.


శిథిలావస్థలో ఉన్న ఎంపీడీవో కార్యాలయం


పాముల పుట్లతో దర్శనమిస్తున్న తహసీల్దార్ కార్యాలయం


వెలుగు, ఉపాధి హామీ పథకం కార్యాలయాల్లో శిథిలమైన తులపులు, కిటికీలు


ముళ్లపొదల మధ్య అర్థాంతరంగా నిలిచిపోయిన ఎంపీడీవో నూతన భవనం

ఏడేళ్లుగా నిర్మాణంలోనే..

శిథిలమైన ఎంపీడీవో భవనానికి పక్కనే ఎనిమిదేళ్ల కిందట కొత్త భవనం నిర్మించారు. నిధుల కొరత, ఇసుక, ఇనుము, సిమెంట్ ఇతర ముడి సరుకుల ధరలు పెరగడం, అంచనా వ్యయం మారకపోవడంతో భవనం పనులు బాలారిష్టాలు దాటలేదు. 2017లో రూ.1.20 కోట్లుతో పనులు ప్రారంభించగా టెండర్ లేటు కావడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాలేదు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రూ.43 లక్షల వరకు బిల్లుచెల్లించినా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగలేదు. దీంతో పాటు మంజూరు చేసిన పలాస , టెక్కలి, మందస, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు సర్వాంగ సుందరంగా పూర్తయి వినియోగంలో ఉన్నాయి. ప్రస్తుతం అర్థాంతరంగా ఆగిపోయిన నూతన భవనం ముళ్ల పొదల మధ్య పాడుబడిన భవనంలా దర్శనమిస్తోంది. కొద్దిపాటి నిధులు విదిల్చితే భవనం పూర్తి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వ నేతలు దృష్టి సారించి వజ్రపుకొత్తూరు మండల పరిషత్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

లోపల ఉండాలంటే భయం



తహసీల్దార్ కార్యాలయం లోపలికి వెళ్లాలంటే భయం వేస్తుంది. పూర్తిగా శిథిలమైంది. ఆర్ఐలు ఉండే గదిలో తలుపులు పూర్తిగా చెదలు పట్టాయి. ఇటీవల పామును సైతం చూశాను. మండల పరిషత్ భవనంలో కొంత మేర మరమ్మతులు చేపట్టినా రంగులు వేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. నిర్మాణంలో ఉన్న భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలి.

–కె.గిరిబాబు, అమలపాడు

పాముల పుట్టలు..



తహసీల్దార్ కార్యాలయం పాముల పుట్టల మయమైంది. వెలుగు, ఉపాధి హామీ పథకం కార్యాలయాలు వర్షం వస్తే చాలు కారిపోతాయి. అర్జీదారులుగా మేం వెళితే కూర్చునేందుకు వీలు లేకుండా ఉంటాయి. 1997లో నిర్మించిన భవనాలు పూర్తిగా కూలదోసి కొత్తవి నిర్మించాలి.

– కె. పాపారావు, పూండి

మరమ్మతులు చేపడతాం

మండల పరిషత్‌లో నిధులు ఉన్నాయి. కొంత మేర ప్రమాదకరంగా ఉన్నచోట మరమ్మతులు చేపట్టాం. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి రంగులు వేయిస్తాం. నిర్మాణంలో ఉన్న భవనానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది.

– ఎస్.రమేష్‌నాయుడు, ఎంపీడీవో, వజ్రపుకొత్తూరు

ఎంపీడీవో కార్యాలయానికి నీటి సరఫరా బంద్!

కంచిలి:

మండలాభివృద్ధిలో కీలకంగా ఉన్నమండల పరిషత్ కార్యాలయానికి రెండు నెలలుగా నీటి సరఫరా నిలిచిపోయింది. కార్యాలయానికి నీటి సరఫరా చేస్తున్న మోటారు మరమ్మతులకు గురైంది. అయితే దాన్ని పునరుద్ధరించే చర్యలను అధికార యంత్రాంగం చేపట్టలేదు. దీంతో కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ఇక్కడికి వివిధ పనులు మీద వస్తున్న ప్రజలకు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.


నీటి సరఫరా లేని ట్యాప్

105 మందికి కంటి పరీక్షలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పలాస సత్యసాయి మందిరంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ 105 మంది రోగులకు పరీక్షలు చేశారు. వీరిలో 55 మందిని కంటిశుక్లాల ఆపరేషన్ల కోసం రిఫర్ చేశారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పచ్చనిచెట్టును కూల్చేశారు!


నిన్న ఇలా..


నేడు ఇలా..

టెక్కలి: టెక్కలిలోని పట్టుమహదేవి కోనేరు గట్టు పై ట్యాక్సీ స్టాండుకు ఆనుకుని దశాబ్దాల కాలంగా ఎంతో మందికి నీడనిచ్చిన పచ్చని చెట్టును మంగళవారం అధికారులు కూల్చేశారు. కోనేరు అభివృద్ధి పేరుతో నీడనిచ్చిన చెట్టును కూల్చేయడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తాయి. హరితాంధ్రప్రదేశ్ అంటూ ఒక వైపు ప్రభుత్వం మొక్కలు నాటి వనాలు పెంచాలని ప్రచారాలు చేస్తూ మరో వైపు నీడనిచ్చిన చెట్లను కూల్చివేయడంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అధికారుల తీరుపై తారస్థాయిలో విమర్శలతో ఎండగడుతున్నారు.

పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి డీడీ బాధ్యతల స్వీకరణ


చంద్రశేఖరరావుకు అభినందనలు తెలియజేస్తున్న సిబ్బంది

టెక్కలి: టెక్కలి డివిజన్ పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి డీడీగా పి.చంద్రశేఖరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఏడీగా పనిచేస్తున్న ఈయన డీడీగా వ్యవహరిస్తారు. ఇక్కడ డీడీగా పనిచేసిన జయరాజ్ పాడేరు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఎస్.శిరీష, ఎస్.గోవింద్, కె.రూప, కె.గోవిందరావు, ఎన్.రామచంద్రరావు, ఎ.సంతోష్ తదితరులు చంద్రశేఖరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

మైక్రో ఫైనాన్స్ రుణాలు తీసుకోవద్దు


మాట్లాడుతున్న కూర్మారావు

మందస: మహిళా సంఘాల సభ్యులు ఎట్టిపరిస్థితుల్లో కూడా మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకోవద్దని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. గ్రామ సంఘం ద్వారా శ్రీనిధి, బ్యాంక్ రుణాలను మాత్రమే తీసుకోవాలన్నారు. మంగళవారం మహిళ సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లీగల్ కో ఆర్డినేటర్ తారక్ మోహన్, క్లస్టర్ కో ఆర్డినేటర్ స్వామి నాయుడు పాల్గొన్నారు.

పచ్చని కానుక..



మందస మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి చదివిన విద్యార్థిని తెప్ప వెన్నెల తన పుట్టిరోజు సందర్భంగా పాఠశాలకు కొన్ని మొక్కలను మంగళవారం వితరణగా అందజేసింది. ఆ మొక్కలను ప్రధానోపాధ్యాయులు కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలో నాటారు. ఉపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు, జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు ఉన్నారు.

–మందస

ఘనంగా కంచమ్మతల్లి మారుజాతర



మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారి సంబర మహోత్సవాలు ఈ నెల ఒకటి నుంచి పదో తేదీ వరకు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలు పూర్తయి వారం రోజుల తర్వాత మంగళవారం సాయంత్రం మారు జాతరను ఘనంగా నిర్వహించారు. జన్నివాడును గ్రామంలో ఊరేగించారు. జన్నివాడికి భక్తులు పసుపు నీళ్లతో అభిషేకం చేశారు. మెయిన్‌రోడ్డులోని అమ్మవారి పీఠస్థానం నుంచి కేశవరావు దాబా వరకు వెళ్లి, అక్కడ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా మఠం కంచిలి వరకు జన్నివాడ్ని ఊరేగింపు చేపట్టారు. ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

–కంచిలి

శిథిలమైన ఏవోబీ రోడ్డు



ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలను కలిపే సరిహద్దు ఏవోబీ రోడ్డు శిథిలమై ప్రమాదకరంగా తయారైంది. పర్లాఖిమిడి నుంచి మందస హైవేకు చేరే ఈ రోడ్డు ఒడిశా భూభాగంలో సక్రమంగా ఉన్నప్పటికీ ఆంధ్రాలో ఉండే రోడ్డు మాత్రం గుంతలమయం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రెండు రాష్ట్రాలను కలిపే డబుల్ లైన్ రోడ్డు అధ్వానంగా తయారైనప్పటికీ ఎవ్వరు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపటాటలని ప్రజలు కోరుతున్నారు.

–కాశీబుగ్గ

ఏడాది పాలనంతా మోసమే

- కూటమి పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు
- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు
- జగన్ అంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన ఈ ఏడాది పాలనంతా మోసాలతో సాగించి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని జడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో చేసిన వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తు వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన 'జగనంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం'పుస్తకాన్ని పట్టణంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పరిపాలనపై ఏడాది వ్యవధిలోనే ప్రజలు తిరగబడే పరిస్థితి దాపురించిందన్నారు. రాష్ట్రంలో 2019–2020 కాలంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన అందించడంతో జగన్ అంటే ప్రజలకు నమ్మకం ఏర్పడిందన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని, రాష్ట్రంలో నడుస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగంతో శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు బోర పుష్ప, నిమ్మన దాస్, పైల దేవదాస్, జడ్పీటీసీ సభ్యులు ఉప్పాడ నారాయణమ్మ, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, పి.రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు నర్తు ప్రసాద్, ధనలక్ష్మి, తులసీరామ్, బచ్చు జగన్, పి.తేజేశ్వరరావు, ముఖ్యనేతలు పిలక సంతు, కడియాల ప్రకాశరావు, తడక జోగారావు, సల్లాదేవరాజు, కారింగి మోహన్‌రావు, కాళ్ల సత్యం, నీలాపు డిల్లి, కిరణ్‌బెహర్, సాలిన గాంధీ, కాళ్ల దర్మతేజ, కారింగి త్రినాథ్, నీలయ్య పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పేరుతో మోసం

సంతబొమ్మాళి: గత సార్వత్రికి ఎన్నికల్లో కూటమి నేతలు సూపర్‌సిక్స్ పేరుతో పాటు 180కు పైగా హామీలిచ్చి ప్రజలను అన్ని విధాల మోసం చేశారని జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి అన్నారు. హనుమంతునాయుడుపేట గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ రూపొందించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం'పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ఏడాది పాలనలో అభివృద్ధి చేయకపోగా వారు చేసిన మోసాలను, అరాచకాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టారని అన్నారు. పాలనంతా విధ్వంసమేనని ధ్వజమెత్తారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేశారని, దీనికి సంబంధించిన వాస్తవాలు, ఆధారాలను ఈ పుస్తకంలో పొందిపరిచినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, నాయకులు గిన్ని ప్రకాష్, నీలకంఠం, మల్లేష్, వాసుదేవరావు పాల్గొన్నారు.

నందిగాంలో..

నందిగాం: 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం'పుస్తకాన్ని నందిగాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు గ్రామాల్లో అరాచకాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం, ప్రశ్నించేవారిని పోలీసులతో బెదిరిస్తున్నారని అన్నారు. ఇసుక, మద్యం మాఫియాలను ప్రోత్సహిస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు సరైన ధరలేక, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించక, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తూ, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని జోగారావు, జడ్యాడ జయరాం, పోలాకి మోహనరావు, తమిరె రాజు, బొమ్మాళి గున్నయ్య, కవిటి ఎర్రయ్య, కింతలి శేషగిరి, అంబోడి విష్ణు, కణితి గిరి, కురమాన ఉత్తంకుమార్, రాజు, తాతబాబు, మురపాక జంగాలు, బాబ్జి, నాగభూషన్,ధనుంజయ, చంద్రం పాల్గొన్నారు.

తిరుగుబాటు చేయాలి..

టెక్కలి: కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన వెన్నుపోటుపై తిరుగుబాటు చేయాలని టెక్కలి ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ కోరారు. టెక్కలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కోటబొమ్మాళిలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ జరిగింది.


ఇచ్ఛాపురం: పుస్తకావిష్కరణలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు తదితరులు


సంతబొమ్మాళి: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి తదితరులు


నందిగాం: పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు


టెక్కలిలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సరోజనమ్మ, నాయకులు.


కోటబొమ్మాళిలో పుస్తకావిష్కరణలో పార్టీ మండల అధ్యక్షుడు హేమసుందర్‌రాజు, నాయకులు

వైభవంగా అన్నపూర్ణమ్మ పూజలు

కవిటి: రాజపురం గ్రామదేవత అన్నపూర్ణమ్మ అమ్మవారికి గ్రామస్తులు నిండు మంగళవారం పూజలను వైభవంగా నిర్వహించారు. వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలతో రైతులు ఆనందంగా ఉండాలని, ప్రజలంతా ఆరోగ్యంతో తులతూగాలని కోరుతూ ఏటా మంగవారం పూజలను అమ్మవారికి చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దను మేళతాళాలతో కాళికా వేషధారణలతో బాణసంచా కాలుస్తూ ఊరేగింపుయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామశివార్లలోని ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం ప్రసాద వితరణ చేశారు.


పూజల్లో భక్తజనం

విత్తనాలు పంపిణీ

కంచిలి: సబ్సిడీపై ప్రభుత్వం అందించిన విత్తనాలను ఎస్.ఆర్.సి.పురం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు డొక్కరి తులసి బలరాం చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయకురాలు జీవన, రైతులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పీఎంపురం సచివాలయంలో మాజీ ఎంపీపీ జి.వసంతరావు చేతుల మీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. అన్నారు. స్వర్ణ, సాంబ, ఇంద్ర, అమర విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ కె.గోపాల్, కార్యదర్శి త్రినాథ్‌రెడ్డి, వీఏఏ సందీప్ ఉన్నారు.

వ్యవసాయాధికారిగా ధనుంజయరావు


ధనుంజయరావు

వజ్రపుకొత్తూరు: మండల వ్యవసాయ శాఖ అధికారిగా బమ్మిడి ధనుంజయరావు నియమితులయ్యారు. కంచిలి మండలంలో ఐదేళ్లు పాటు విధులు నిర్వహించిన ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడకు వచ్చిన ఈయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఐదేళ్ల పాటు ఇక్కడ వ్యవసాయ విస్తరణాధికారిగా విధులు నిర్వహించారు.

అలరించిన నాట్యకారులు

ఇచ్ఛాపురం: ఒడిశాలోని గంజాం జిల్లా బరంపురం కలికోట్ కళాశాలలో నిర్వహించిన వికాస్ మేళా–2025 సాంస్కృతిక కార్యక్రమాల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వేంకటేశ్వర డాన్స్ అకాడమీ చిన్నారులు సాంస్కృతిక నృత్యాలతో ఆలరించారు. ఈ విషయాన్న అకాడమీ అధ్యక్షులు చిన్నాగురుస్వామి మంగళవారం తెలిపారు. చిన్నారులకు ఒడిశా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒడిశాకు చెందిన నాట్యగురువు లక్ష్మణ్ కుమార్ దాస్ చేతులు మీదుగా జ్ఞాపికలతో సత్కరించారు.


సత్కారం పొందిన నాట్యకారులు